
# కాంతి కిరణం

- నిశాపతి

ఉగాది పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ



**మా**నసిక విశ్లేషణా శిక్షణ కళాశాలలో ఆరోజు చాలా హడావిడిగా వుంది. సైకాలజీ ఎం.ఏ. ప్యాసయిన వాళ్లకి ఆ కాలేజీలో ఓ ఏడాదిపాటు శిక్షణ యిస్తారు. ఉత్తీర్ణులైన వాళ్లకి 'డిప్లొమా' లభిస్తుంది. డాక్టర్ అభిరాం నేతృత్వంలో నడిచే ఆ కళాశాల డిప్లొమా చాలా ప్రతిష్ఠాత్మకమైనదిగా భావిస్తారు, ముఖ్యంగా వైద్య వర్గాలవారు.

ఇంతకీ, ఆరోజు హడావిడికి కారణం, పదకొండు నెలల థియరీ క్లాసులు పూర్తయి, కాలేజీకి శలవులివ్వడమే! ఓ నెలపాటు ప్రాక్టికల్స్ చేయాలి, పరీక్షకి కూచోవాలంటే! ఒక్కో 'బ్యాచ్'ని ఒక్కో సంస్థకి 'ఎలాట్' చేస్తారు.

'నీలిమ'కి 'హెలెన్ కెల్లర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది విజువల్లీ ఛాలెంజ్‌డ్' సంస్థ ఎలాటయింది.

వాళ్లని 'ఇంటర్వ్యూ'చేసి, వాళ్లలో ఏదైనా డిప్రెషన్ వుందేమో కనిపెట్టి, వుంటే దాన్ని 'మానసిక శాస్త్ర పద్ధతుల ద్వారా ఎలా దూరం చేయాలి?'అన్న అంశం మీద థీసిస్ రాసి సమర్పించాలి.

'గగన్'ని చూస్తూనే ఒక్క క్షణం నీలిమ గుండె లయ తప్పింది. అతను అంధుడంటే ఎవరూ నమ్మరు. తెల్లటి శరీరం, క్లీన్‌షేవ్‌తో పచ్చగా మెరిసే గడ్డం, ఉంగరాల జుట్టు, కొసదేరిన నాసిక, ముఖ్యంగా అందమైన ఆ కళ్లు- చూసినవారెవరూ అతన్ని అంధుడనుకోరు.

క్వశ్చనీర్ చేతిలో పట్టుకుని నీలిమ అతన్ని ఒక్కో ప్రశ్నే అడిగి సమాధానం రాసుకుంటోంది.

"జీవితంలో ఉన్నత శిఖరాలని అధిరోహించడానికి అంధత్వం ఒక అవరోధంగా మీకెప్పుడైనా అనిపించిందా?' అంది నీలిమ.

గగన్ నవ్వాడు.

"లేదు. ఎందుకంటే నేనసలు ఎప్పుడూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అనుకోలేదు" అన్నాడు.

నీలిమ తెల్లబోయింది. ఈ ప్రశ్నకి యింతవరకు ఎవ్వరూ యిలాంటి జవాబు యివ్వలేదు.

"మీరు షాకయ్యారు గదూ!" అన్నాడు గగన్ మళ్లీ.

నీలిమ ఆశ్చర్యపోయింది. కాని పైకి మాత్రం మొండిగా, "గొప్పవాడు కావాలనే కోరికగూడా లేకపోవడం గొప్పతనం కాదు. అకర్మణ్యత్వం, పిరికితనమూను!" అంది.

"ఎందుకలా నా విషయంలో మీరు తీర్పులు యిచ్చేస్తున్నారు?! పుట్టిన ప్రతి ప్రాణీ గొప్పవాడయి తీరాలా? ఈ ప్రపంచానికి సామాన్యులు అక్కర్లేదా? నా మట్టుకి నేను, నాలో ఈ లోపం లేకపోయినా, మీరన్న ఆ 'శిఖరాల'కేసి కన్నెత్తయినా చూసేవాడిని కాదు. నవ్వుతూ, తుళ్లుతూ, నలుగురికి సాయపడుతూ, నలుగురి సాయం పొందుతూ, ఆనందంగా జీవిస్తే చాలని కోరుకునేవాడిని. ఇప్పుడూ అదే కోరుకుంటున్నాను" అన్నాడు గగన్.

నీలిమ మనస్సులోనే అతని 'ఫిలాసఫీ'ని అభినందించకుండా ఉండలేకపోయింది.

"మరి మీరున్న ఈ పరిస్థితుల్లో మీరు కోరుకునే ఆ ఆనందమయ జీవితం, నలుగురికి సాయపడడం వగైరా..."

గగన్ మళ్లీ నవ్వాడు.

"ఎలా సాధ్యం? అంటారు. దానికి సమాధానం 'ప్రశ్న-జవాబు' రూపంలో చెప్పడం కష్టం. మీకు నిజంగా తెలుసుకోవాలని వుంటే నాతో కొన్నాళ్లపాటు స్నేహం చెయ్యండి. తెలుస్తుంది" అన్నాడు.

నీలిమ కంగారు పడింది.

ఆమె ముఖంలో భావాలు చదివినవాడిలా, "మీరేమీ గాభరా పడకండి. నేనేమీ మీకు లైనెయ్యడం లేదు" అన్నాడు గగన్, నవ్వుతూ.

నీలిమ మొహం రోషంతో ఎర్రబడింది. క్షణాల్లో ఒక నిర్ణయానికి వచ్చింది.

"నాకలాంటి భయాలేం లేవు. ఓకే! ఈ క్షణం నించీ మనం స్నేహితులం" అంది. అలా ప్రారంభమైంది వాళ్ల స్నేహం.

* * *

రోజులు గడిచేకొద్దీ నీలిమకు అర్థంకావడం మొదలెట్టింది. గగన్ ఒక విజ్ఞాన సర్వస్వం. బ్రెయిలీ లిపిలో వున్న గ్రంథాలేవీ అతను వదిలిపెట్టినట్లు లేదు. ఏ విషయంలో అయినా అతని పరిజ్ఞానం చాలా సహేతుకంగా, మౌలికంగా వుండేది. అంతేగాదు! అతను చాలా సున్నిత మనస్కుడు!

నీలిమ తనకి తెలీకుండానే గగన్ వైపు ఆకర్షితురాలు కావడం మొదలెట్టింది. కాని ఈ ఆకర్షణ దేనికి దారితీస్తుందో అని లోపల్లోపల చాలా భయపడుతూండేది. ఒక అంధుణ్ణి భర్తగా వరించి, చీకటి జీవితాన్ని ఆహ్వానించడానికి తనేమీ గాంధీ మహాత్ముడో, మదర్ థెరిసానో కాదు! అయినా గగన్ సాన్నిహిత్యాన్ని వదులుకోడానికి ఆమెకి మనసొప్పలేదు.

వాళ్ల స్నేహం స్నేహంలాగే కొనసాగుతోంది. నీలిమ మనసులో అలజడి గూడా దాంతోపాటే పెరుగుతోంది.

* * *

సాధారణంగా గగన్‌కి తన వైకల్యాన్ని గురించిన టాపిక్ యిష్టం వుండదు. అయినా నీలిమని నొప్పించలేక ఆమె ఏదైనా ఆ విషయంలో అడిగితే జవాబు యిస్తూండేవాడు.

"దీనికి చికిత్స లేదా?" అని అడిగింది నీలిమ ఓరోజు.

"ఎందుకు లేదు?! 'కార్నియా ట్రాన్స్‌ప్లాంటేషన్'తో తిరిగి చూపు వచ్చే అవకాశం వుందట."

"మరయితే నువ్వు ఎందుకు ప్రయత్నించలేదు?"

"కార్నియాని డబ్బుకి అమ్మే సంస్థలు వున్నాయేమో నాకు తెలీదు. ఉన్నా కొనడానికి నా దగ్గర డబ్బు లేదు. ఇక 'ఉచితంగా యిచ్చే' ఐ బ్యాంకుల్లో పేరు రిజిష్టరు చేయించాను. నావంతు రావడానికి యింకా యాభై ఏళ్లు పడుతుందట." అంటూ నవ్వాడు గగన్.

నీలిమ నవ్వలేదు.

* * *

టీవీలొచ్చాక గూడా రేడియోని మర్చిపోని కొద్దిమందిలో నీలిమ తల్లి ఒకరు. ఆవిడ రోజూ ఉదయం 'జనరంజని'లో పాటలు తప్పకుండా పెట్టుకుని వింటుంది.

ఆ రోజు నీలిమ టిఫిన్ చేస్తోంటే రేడియోలో ఏవో పాటలు వస్తున్నాయి. 'శిలలపై శిల్పాలు చెక్కినారూ...' అంటూ ఘంటసాల కంఠం హంపీ అందాల్ని కళ్లముందు బొమ్మ కట్టిస్తోంది. పాట మధ్యలో స్టకప్ అయిపోయి, 'నా కనులు నీవిగా చేసుకొని చూడు' '... చేసుకొని చూడు...' 'చేసుకొని చూడు...' అని వస్తోంది.

నీలిమ చిరాగ్గా తల ఎత్తింది. పాట యింకా అలాగే వస్తోంది.

హఠాత్తుగా నీలిమ మెదడులో ఫ్లాష్‌లా ఓ ఆలోచన మెదిలింది. అవును! తనెందుకు గగన్‌ని, తన కళ్లు... అదే... కన్ను, 'అతని కన్నుగా చేసుకుని చూసేలా' చెయ్యగూడదు?!

ఛ! ఇంత చిన్న ఆలోచన తనకి ఇన్నాళ్లూ ఎందుకు రాలేదు?! ఎప్పుడో మరణానంతరం ఎవరో అపరిచితుడికి ఒక వ్యక్తి కళ్లు ఉపయోగపడడం గొప్ప ఆదర్శమే కావచ్చు! కాని, అది ఈ జన్మలోనే తనకే ఉపయోగపడి, తన జీవితంలోనే వసంతాలు విరబూయిస్తే! తన సమస్యకి ఎంత చక్కని పరిష్కారం దొరికింది!

* * *

శంఖం లాంటి అందమైన మెడ మీద వున్న, అంతకన్నా అందమైన నీలిమ తలలో ఓ చురుకైన మెదడు గూడా వుంది. ఆ ఆలోచనల్లో ఓ 'మెథడు' గూడా వుంది.

ఐడియా రాగానే వెళ్లి గగన్‌తో 'ఐ లవ్ యు' అన లేదు నీలిమ. వెంటనే డాక్టర్ని కలిసింది. అతనితో తను చెయ్యదలుచుకున్నది చెప్పింది.

డాక్టరు విస్తుపోయాడు. అతని దగ్గరికి ఇంతవరకు ఎవరూ ఇటువంటి ప్రతిపాదనతో రాలేదు. మనిషి పోయాక కళ్లు దానం చెయ్యడానికే లక్షా తొంభై అనుమానాలున్న సమాజంలో, ఇలాంటి అమ్మాయిని చూడ్డం అతనికి కొత్తగా వుంది. ఏమైనా, డాక్టర్‌గా తన 'ఎథిక్స్' తనకున్నాయి.

"మీ ఆలోచన సరైంది కాదు" అన్నాడు డాక్టరు ఉపోద్ఘాతంగా.

"ఎందుకని?"

"భగవంతుడు రెండు కళ్లు యిచ్చింది, ఒకటి పోగొట్టుకొమ్మని కాదు."

"ఏం? ఈ ప్రపంచంలో ఎంతమంది ఒకే కన్నుతో జీవించడం లేదు?"

"వాళ్లకి మార్గాంతరం లేదు. కాని మీరు చేజేతులా అంధత్వం కొని తెచ్చుకుంటారా?! మాటవరుసకి రేపు ఏదైనా ప్రమాదంలో మీ రెండో కంటికి అపాయం జరగొచ్చు. అప్పుడేమవుతుంది?"

"ఆ రిస్క్ ఎప్పుడూ వుంది. రెండు కళ్లూ వుండే మాత్రం అలాంటి ప్రమాదాల్లో రెంటికీ నష్టం జరగొచ్చుగా?" అంది నీలిమ.

"మనుషులు భగవంతుడు యివ్వని వాటి గురించి ఆయన్ని నిందిస్తారే తప్ప, యిచ్చిన వాటి విలువ గుర్తించరు. ఉదాహరణకి ఓ మిలియన్ డాలర్లిస్తానంటే మీ రెండు కళ్లూ యివ్వగలరా? ఇవ్వరుగదా? అంటే మీ కళ్లు మిలియన్ డాలర్ల కంటె ఎక్కువ విలువైనవన్నమాటే గదా?- అన్నాడు డేల్ కార్నీ. మీరేమో యిలా..." అన్నాడు డాక్టరు.

"మీరు ఉదహరించిన మాటలు ఈ సందర్భానికి వర్తించవు. ఎందుకంటే- ఒకటి, నేను రెండు కళ్లూ యివ్వడం లేదు; రెండు, అతను నాకు మిలియన్ డాలర్ల కంటె ఎక్కువే!"

"ఏమైనా చూస్తూచూస్తూ ఒక డాక్టర్‌గా యిలాటి పని నేను చెయ్యలేను."

నీలిమ తియ్యగా నవ్వి, 'పేషంట్‌కి తెలీకుండా దొంగతనంగా అతని కిడ్నీలు తీసి అమ్ముకునే దేశంలో మీలాంటి వైద్యులున్నందుకు చాలా గర్వంగా వుంది, డాక్టర్! కాని నేను బాగా ఆలోచించి తీసుకున్న నిర్ణయం యిది! నా స్వంత బాధ్యత మీద, పూర్తి యిష్టంతో యీ పని చేస్తున్నాను నేను" అంది.

"ఇది లీగల్ కాదనుకుంటాను. పైగా 'ఎథికల్' కూడా కాదు."

"డాక్టర్! మా నాన్న లాయరు. పైగా ఎమ్మెల్యే! మీకెలా కావలిస్తే అలా అగ్రిమెంట్ రాయించి సంతకం పెట్టి యిస్తాను. ఏదైనా గొడవ వస్తే మా నాన్న చూసుకుంటారు. నేనంటే ఆయనకి విపరీతమైన ప్రేమ. ఏం చేసినా కాదనరు. ఇక 'ఎథిక్స్' అంటారా? ఒక మనిషికి నేత్రదానం చెయ్యడం కంటె గొప్ప 'ఎథిక్స్' ఏముంటాయి, చెప్పండి!"

"లేదు! లేదు! అసలు అలా సజీవ వ్యక్తుల్నించి కార్నియా తీయడం 'ఫీజిబుల్' కాదు."

నీలిమ మళ్లీ నవ్వింది.

"డాక్టర్! మీరెంత మంచివారంటే అబద్ధం ఆడడం కూడా రాదు. 'ఫీజిబుల్' కాకపోతే ముందే చెప్పేవారు. ముఖస్తుతి అనుకోకండి. ఏది ఫీ'జ'బులా అని ఆలోచించే వ్యవస్థలో మీరు ఏది ఫీ'జి'బులా అని ఆలోచిస్తున్నారు. నిజంగా మీరు చాలా గొప్పవారు" అంది.

"నేను మెడికల్ కౌన్సిల్‌ని సంప్రదించాలి. నాకు కాస్త టైం యివ్వండి" అన్నాడు డాక్టరు.

"దట్స్‌ఫైన్! మళ్లీ ఎప్పుడు కలవను?"

డాక్టరు చెప్పాడు. నీలిమ వెళ్లిపోయింది.

* * *



*అసలు పేరు ఎం.హెచ్.వి. సుబ్బారావు. విద్యార్హతలు బి.ఇ., ఎం.ఏ. పంచాయతీరాజ్ శాఖలో 'చీఫ్ ఇంజనీర్' హోదాలో ఉద్యోగ విరమణ. వివిధ పత్రికల నుండి, ఇంకా రంజని, కవన వేదిక, సిలికానాంధ్ర, ఆటా వంటి సంస్థలనుండీ పలు బహుమతులు కవితలకీ, కథలకీ అందుకున్నాను. 'కలకలం' కవితా సంపుటికి జాతీయ సాహిత్య పరిషత్, సిద్దిపేట వారి అవార్డు, 'నిశాపతి కథలు' కథా సంపుటికి 'బులుసు సీతాకుమారి స్మారక సంస్థ, మచిలీపట్నం' వారి అవార్డూ లభించాయి. ప్రస్తుతం ఆంధ్ర పద్య కవితా సదస్సు, జంట నగరాల శాఖకి కార్యదర్శిగా వున్నాను.*

*ఆంధ్రభూమి ఆదివారం అనుబంధంలో 'పద చదరంగం', ప్రమిద త్రైమాసిక పత్రికలో 'పద్యాల పందిరి', 'ఆవలి తీరం' పత్రికలో 'స్మైల్ క్యాప్సూల్స్'వంటి శీర్షికలు నిర్వహిస్తున్నాను.*

*-నిశాపతి,*
*48/101, హుడా కాంప్లెక్స్, సరూర్‌నగర్,*
*హైదరాబాదు-35.*

డాక్టరు దగ్గరినించి వచ్చాక నీలిమ గగన్‌తో తన ప్రేమ గురించి చెప్పింది. "నీకు పిచ్చన్నా ఎక్కి వుండాలి. లేక గుడ్డివారి కళ్లల్లో గూడా నీళ్లుంటాయేమో తెలుసుకునేందుకు చేసే ప్రయత్నం అయినా అయి వుండాలి యిది" అన్నాడు గగన్ కామ్‌గా.

"మాటి మాటికీ 'గుడ్డివాడిని, గుడ్డివాడిని' అని నిన్ను నీవు కించపరుచుకోకు! డాక్టరుతో మాట్లాడాను. నీకు చూపు వస్తుంది."

"ఎలా?"

తనకీ డాక్టర్‌కీ మధ్య నడిచిన సంభాషణ అంతా వివరించి చెప్పింది నీలిమ. వింటూనే గగన్ మొహం అభిమానంతో ఎర్రబడింది.

"ఇది నామీద ప్రేమ కాదు. జాలి! కేవలం జాలి! నన్ను చూసి ఎవరైనా జాలిపడ్డం అంటే నాకు అసహ్యం" అన్నాడు.

"ఎందుకలా అనుకుంటావ్? నిన్ను నేను నిజంగానే ప్రేమిస్తున్నాను" అంది నీలిమ.

గగన్ విరక్తిగా నవ్వాడు. "నన్ను ప్రేమిస్తున్నావా? ఏం చూసి?! తల్లెవరో తండ్రెవరో తెలీదు. పైగా ఈ అంధత్వం ఒకటి! దాన్ని పోగొట్టడానికి నీ పిచ్చి ఆలోచనలు. పిచ్చి త్యాగాలు! ఈ తెలివి తక్కువ ఆలోచన మానుకో!" అన్నాడు.

నీలిమ నవ్వి, "నిన్ను ఏం చూసి ప్రేమించానన్నావ్ గదూ! నీ తెలివి, సంస్కారం, ప్రిన్సిపుల్స్- ఆపై నీ అందం" అంది.

"అందం! హు! అసలు ఆ మాటకే అర్థం తెలీని బతుకు నాది!" అన్నాడు గగన్.

నీలిమ ఆశ్చర్యం నటిస్తూ, "నీలో యింత 'సెల్ఫ్ పిటీ' వుందని నాకు తెలీదు సుమీ! అయితే, దృఢ వ్యక్తిత్వం గురించి నువ్వు చెప్పే కబుర్లన్నీ చిలక పలుకులన్నమాట!" అంది.

గగన్ చివాలున తలెత్తి, "ఇదేం సెల్ఫ్ పిటీకాదు! తెలివి తక్కువగా అగ్నిలోకి ఉరకబోతున్న శలభాన్ని పక్కకి తప్పించడంకోసం చెబుతున్న పచ్చి నిజం" అన్నాడు.

నీలిమ రాజీపడుతున్నట్లు, "నా ఆలోచనలో ఎక్కడ లోపం వుందో చెప్పు! నేనేమీ 'సెంటిమెంటల్ ఫూల్' లాగా ఆలోచించడం లేదే! పూర్తి 'ప్రాక్టికల్'గా ఆలోచిస్తున్నాను" అంది.

"ఆ నష్టాలన్నీ నీకు డాక్టర్ చెప్పాడు. నువ్వేదో త్యాగం చేస్తున్నానన్న భ్రమలో ఆ 'రిస్క్'ని 'లైట్'గా తీసుకుంటున్నావు. కాని అది ఎంత పెద్ద రిస్కో నీకు అర్థంకావడం లేదు" అన్నాడు గగన్.

"ఇది రిస్క్ అయితే కాల్క్యులేటెడ్ రిస్క్. ఆ మాత్రం రిస్క్ లేకుండా జీవితంలో ఏదీ లభించదు. ఇక నీ అభ్యంతరాలేవీ నేను వినదల్చుకోలేదు. డాక్టరుతో మాట్లాడి ఆపరేషనుకి ఏర్పాటుచేస్తాను"అంటూ వెళ్లిపోయింది నీలిమ.

* * *

గగన్‌కి చూపు వచ్చింది. నీలిమా గగన్ దంపతులయ్యారు. అయిదేళ్లు గడిచాయి. వాళ్లకో పాప పుట్టింది.

## 2

సైన్స్ కాంగ్రెస్ సభలు జరుగుతోన్న ఆ హాలంతా ఒకరి గుండె చప్పుడు ఒకరికి వినిపించేంత నిశ్శబ్దంగా వుంది. గౌరవ ఆరోగ్యశాఖా మంత్రి గారిచే ప్రారంభించబడిన ఆ సభలో మొదటి సెషన్‌లో మొదటి పేపరుగా ఇండియన్ అమెరికన్ డాక్టర్ సునయన పేపరు ఎంపికైంది.

ఆమె పేపర్ చదువుతోంది.

'ఇది టెక్నికల్ పేపరా, లేక, సైన్స్ ఫిక్షన్ కథా?' అన్నట్లు మొహాలు విసుగ్గా పెట్టుకుని కూర్చున్నారు కొందరు శ్రోతలు.

డాక్టర్ సునయన తన పేపరు చదవడం కొనసాగిస్తూ, "అలా నీలిమ కడుపున ఆనాడు పుట్టిన పాపని... నేనే!" అంది.

విసుగ్గా వింటోన్న శ్రోతలతో సహా అందరూ 'ఎలర్ట్' అయ్యారు.

"పుట్టగానే నా అందమైన కళ్లు చూసి నాకా పేరు పెట్టారట! కొన్ని నెలలు గడిచాక గాని నా చూపులో ఏదో తేడా వుందని కనుక్కోలేకపోయారు. ఏడాది వయసు వచ్చేసరికి పూర్తిగా అంధురాలినని ధృవీకరించారు.

అప్పుడు సీన్ మారిపోయింది. అప్పటిదాకా అందాల బొమ్మగా కనిపించిన నేను క్షణాల్లో 'గుదిబండ'గా మారిపొయ్యాను. నన్ను వదిలించుకోవాలని ప్రయత్నాలు మొదలెట్టారు. మా నాన్నగారు పెరిగిన అంధుల ఆశ్రమంలోనే నన్ను చేర్పడానికి మా తాతగారు నిర్ణయించారు. మా నాన్నగారు అప్పుడప్పుడే మా తాతగారి దగ్గర రాజకీయాల్లో తప్పటడుగులు వెయ్యడం నేర్చుకుంటున్నారు. ఆ కృతజ్ఞతతో ఆయన మా తాతగారికి వంత పాడారు. నా అంధాశ్రమవాసం యించుమించు ఖాయమైంది.

అప్పుడు ఎదురు తిరిగింది మా అమ్మ- తండ్రికీ, భర్తకీ- అందరికీ!

మా నాన్నవైపు ఒకసారి చూసి నాతో బైటికి వచ్చేసింది! ఆ చూపులో ఏయే భావాలు ప్రతిఫలించి వుంటాయో నేనీనాడు వూహించుకోగలను. (మిగతా 27వ పేజీలో)

# సైన్స్ టిప్


-సి.వి.సర్వేశ్వర శర్మ

## రక్తపోటు అంటే..? (B.P)

మనిషి శరీరంలో గుండె రక్తాన్ని వేరువేరు అవయవాలకు ధమనులనే శుద్ధ రక్తనాళాల ద్వారా పంపు చేస్తుంది. గుండె పంపు చేయడం అంటే అది ముడుచుకుని తెరచుకుని పనిచేస్తూ ఉంటుంది. ఇలా గుండె పనిచేయడంతో రక్తం రక్తనాళాల్లోకి గెంటబడుతూ ఉంటుంది. ఈ నిరంతర ప్రక్రియ ఫలితంగా రక్తం రక్తనాళాల్లోకి ప్రవహిస్తూ ఉంటుంది.

ఇలా ప్రవహించే రక్తం రక్తనాళాలపై ఒత్తిడి కలుగజేస్తుంది. దీనినే రక్తపోటు అంటారు. గుండె ముడుచుకున్నప్పుడు అందలి రక్తం కొంత ఒత్తిడితో రక్తనాళాల్లోకి గెంటబడుతుంది. ఆ సమయంలో ధమనులు ఎంత రక్తపోటుకి గురికాబడతాయో దానిని సిస్టోలిక్ రక్తపోటు అంటారు.

ముడుచుకున్న గుండె తెరచుకున్నప్పుడు మరల ధమనులలోకి కొంత ఒత్తిడితో రక్తం ప్రవహిస్తుంది. ఈ సమయంలో ధమనులు ఎంత రక్తపోటుకి గురిఅవుతాయో దానిని డయాస్టోలిక్ రక్తపోటు అంటారు.



ఉండాల్సిన రక్తపోటుకన్నా అధికంగా రక్తపోటు ఉంటే దానిని హైపర్ టెన్షన్ లేదా అధిక రక్తపోటు అంటారు. స్పిగ్మొమానోమీటర్‌తో శరీరంలోని రక్తపోటును మిల్లీ మీటర్ల పాదరస స్తంభం ఎత్తులో కొలుస్తారు.

సిస్టోలిక్, డయాస్టోలిక్ రక్తపోటును 120/80గా రాస్తారు. అంటే సిస్టోలిక్ రక్తపోటు 120 మి.మీ. పాదరస స్తంభం ఎత్తులో ఉందని, డయాస్టోలిక్ రక్తపోటు 80 మి.మీ. పాద రస స్థంభం ఎత్తులో ఉందని అర్థం.

ఈ రక్తపోటుల స్థాయినిబట్టి అధిక రక్తపోటును మూడు రకాలుగా చెబుతారు. తీవ్రముకాని రక్తపోటు, పరిమితి స్థాయిలో రక్తపోటు, తీవ్రమైన రక్తపోటు.

| రక్తపోటు | సిస్టోలిక్ (మి.మీ. పాదరసం) | డయాస్టోలిక్ (మి.మీ. పాదరసం) |
|---|---|---|
| తీవ్రము కానిది (మైల్డ్) | 140-149 | 90-99 |
| పరిమితి స్థాయి (మోడరేట్) | 150-159 | 99-110 |
| తీవ్రమైనది (సివియర్) | 160కి మించి | 110కి మించి. |

ఎందుకు అధిక రక్తపోటు వస్తుంది? అనే విషయంపై ఇంత వరకు వైద్య శాస్త్రానికి సరియైన కారణం తెలియలేదు. దీనినే ప్రైమరీ లేదా ఇడియోపాథిక్ హైపర్ టెన్షన్ అంటారు.

కొంతమందికి ధమనుల గోడలు దళసరిగా తయారై రక్త ప్రసరణ మార్గం సన్నబడుతుంది. అందుకే వీరికి అధిక రక్తపోటు ఉంటుంది. మరి కొంతమందిలో ఎడ్రినల్ గ్రంధిలో ట్యూమర్స్ ఏర్పడడం, మూత్ర పిండాల సమస్యలు, కొన్ని ఔషధాలు సేవించడం వలన, గర్భిణీ సమయంలోను అధిక రక్తపోటు వస్తుంది.

ఇటువంటి వారిలో ఏ కారణంవల్ల రక్తపోటు పెరిగిందో ఆ కారణాన్ని సవరిస్తే అధిక రక్తపోటు తగ్గి మామూలు రక్తపోటుకు పరిస్థితి వస్తుంది. హైపర్ టెన్షన్ రావడానికి వారసత్వం ఒక ముఖ్య భూమిక అవుతుంది. తల్లిదండ్రులు, తాత ముత్తాతలు అధిక రక్తపోటు కల్గి వున్నవారయితే వారసత్వంగా ఈ తరం వ్యక్తికి కూడా అధిక రక్తపోటు ఉండే అవకాశాలు చాలా హెచ్చుగా ఉంటాయి. ★

**ఉండాల్సిన రక్తపోటుకన్నా అధికంగా రక్తపోటు ఉంటే దానిని హైపర్ టెన్షన్ లేదా అధిక రక్తపోటు అంటారు. స్పిగ్మొమానోమీటర్‌తో శరీరంలోని రక్తపోటును మిల్లీ మీటర్ల పాదరస స్తంభం ఎత్తులో కొలుస్తారు.**

---

(9వ పేజీ తరువాయి)

త్వరలోనే, తను సరదాగా నేర్చుకున్న కంప్యూటరు పరిజ్ఞానంతో, స్నేహితుల సాయంతో అమెరికాలో ఓ చిన్న ఉద్యోగం సంపాదించుకుని, నన్ను తీసుకుని విమానం ఎక్కింది. అక్కడ అందరితో 'సింగిల్ పేరెంట్'నని చెప్పుకుంది.

అదే సమయంలో న్యూయార్కులో 'విలియం డోబెల్లే' అనే శాస్త్రవేత్త కృత్రిమ నేత్రాల మీద పరిశోధన చేస్తున్నారు. జెర్రీ అనే అంధుడి మెదడులో 'ఎలక్ట్రోడు'లు అమర్చి, నడుమువద్ద రెండు చిన్న కంప్యూటర్లు పెట్టి, కెమేరాలతోనే కళ్లద్దాలు తయారుచేసి అతను చూడగలిగేలా చేశారు.

ఆ విషయం తెలుసుకున్న అమ్మ తన ఉద్యోగాన్ని వదిలేసి ఆయన దగ్గర కంప్యూటర్ అసిస్టెంటుగా చేరింది. నా పరిస్థితినంతా వివరించి చెప్పింది. నాకోసం, నాలాంటి వాళ్లకోసం అహర్నిశలూ శ్రమించి ఎన్నో పరిశోధనల్లో పాల్గొంది. నేను క్రమంగా పెద్దదాన్నై, గ్రాడ్యుయేషన్ అయిపోయాక, ఈ పరిశోధనల్లో ఆయనకి అసిస్టెంటుగా కుదురుకున్నాను. ఆ నిరంతర పరిశోధనల ఫలితమే ఇవాళ 'చూసేవాళ్లు తేడా గ్రహించలేనంత సున్నితమైన' అంధుల కళ్లజోళ్లు. నా కళ్లజోడు అలాంటిదే! ఇదే నా కళ్లజోడు! ఇదే నా కన్ను! ఇప్పుడు దాని శాస్త్రీయ వివరాలు మీకు 'పవర్ పాయింట్ ప్రెజెంటేషన్' యివ్వబోతున్నాను" అని కాసేపు ఆగింది డాక్టర్ సునయన.

ముఖ్య అతిథిగా వేదికనలంకరించిన ఆరోగ్యశాఖా మంత్రి లేచి, "అంతరాయాన్ని మన్నించాలి. ఒక్క విషయం సభాముఖంగా మనవి చెయ్యాలని లేచాను. డాక్టర్ సునయన పరిచయం చేసే ఈ కృత్రిమ నేత్ర ప్రాజెక్టుని మన రాష్ట్రంలోనే ప్రారంభించమని, ముఖ్యమంత్రిగారితో మాట్లాడి ఆ ప్రాజెక్టుకి అవసరమయ్యే నిధుల్ని మా శాఖ నుండి కేటాయిస్తాననీ తెలియజెయ్యడానికి ఆనందిస్తున్నాను. నాకు ఈ సభలో చివరిదాకా పాల్గొనాలని వుంది గాని యిప్పుడే ముఖ్యమంత్రిగారి దగ్గర్నించి అర్జంటుగా రమ్మని 'మెసేజ్' రావడం వల్ల వెళ్లక తప్పడంలేదు. శలవు!" అన్నాడు.

ఆ తర్వాత ఆయన డా. సునయన దగ్గరగా వచ్చి, ఆమె తలపై చేయి వుంచి ఆశీర్వదిస్తూ "చిన్నవారైనా మీరు సాధించింది అద్భుతం డాక్టర్ మీకు ఆయురారోగ్య ఐశ్వర్యాలు యివ్వాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను" అన్నాడు.

డాక్టర్ సునయన నవ్వి, "అంత బిల్డప్ దేనికి నాన్నా! నువ్వే నా తండ్రివని నేను ఎవరికీ చెప్పన్లే!" అంది, ఆయనకి మాత్రమే వినబడేలా!

*(అంకితం: ఎప్పుడో పేపరు వార్తల్లో చదివిన శాస్త్రవేత్త 'విలియం డోబెల్లే' గారికి)*

★